నమస్తే తెలంగాణ

ఆదిలాబాద్-నిర్మల్

5 | నిజామాబాద్ మంగళవారం 25 జూన్ 2024 | ADILABAD NIRMAL


# బాలికలదే పైచేయి..

- ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల
- ప్రథమంలో 69.84, ద్వితీయంలో 70.49 శాతం ఉత్తీర్ణత

నిర్మల్ అర్బన్, జూన్ 24 : ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ శాఖ అధికారులు విడుదల చేశారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 3,040 మంది పరీక్షకు హాజరు కాగా.. 2,123 మంది 69.84 శాతంతో ఉత్తీర్ణత సాధించారు. ఇందులో బాలురు 1,453 మందికి 846 (58.22 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 1,587 మందికి 1,277(80.47 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 1,711 మందికి 1,206 మంది 70.49 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇందులో బాలురు 1107 మందికి 750(67.75 శాతం).. బాలికల విభాగంలో 604 మందికి 450(75.50 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ విభాగంలో ప్రథమ సంవత్సరంలో 383 మందికి 244(63.71 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో బాలురు 244 మందికి 130(53.28 శాతం) మంది, బాలికల విభాగంలో 139 మందికి 114(82.01 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ ద్వితీయ సంవత్సరంలో 316 మందికి 191(60.44 శాతం) మంది ఉత్తీర్ణులు అయ్యారు. ఇందులో బాలురు 241 మందికి 135(56.02 శాతం) మంది, బాలికల్లో 75 మందికి 56(74.67 శాతం) మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

# కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యేలు

నేరడిగొండ, జూన్ 24 : ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో కేసీఆర్‌ను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మిలు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్ నియోజకవర్గ ప్రజల యోగక్షేమాలపై ఆరా తీశారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ అండగా ఉండాలని ఎమ్మెల్యేలకు సూచించారు.



కేసీఆర్‌తో ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, అనిల్ జాదవ్



తమకు న్యాయం చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్‌ను కలిసి వేడుకుంటున్న గృహజ్యోతి దరఖాస్తుదారులు

# జీరో గుబులు

## నిరుపేదలకు వర్తించని గృహజ్యోతి

- దరఖాస్తు చేసినా అందని విద్యుత్ సబ్సిడీ
- బిల్లులు రావడంతో అయోమయంలో వినియోగదారులు
- కలెక్టర్‌ను కలిసేందుకు తరలి వచ్చిన కొండాపూర్ గ్రామస్తులు
- విద్యుత్ శాఖ అధికారుల నిలదీత

నిర్మల్, జూన్ 24(నమస్తే తెలంగాణ) : గృహజ్యోతి పథకంలో భాగంగా జీరో విద్యుత్ బిల్లు వస్తుందని ఆశపడ్డ లబ్ధిదారులకు క్షేత్రస్థాయిలో నిరాశే ఎదురవుతున్నది. జిల్లా వ్యాప్తంగా వేలాది మందికి తెల్ల రేషన్ కార్డు ఉండి, 200 యూనిట్ల కన్న తక్కువ విద్యుత్తు వాడినా ప్రయోజనం చేకూరడం లేదు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నప్పటికీ జీరో బిల్లు రావడం లేదని వాపోతున్నారు. పథకం ప్రారంభమైన నాటి నుంచే అర్హులందరూ ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. నిన్న మొన్నటి వరకు ఎన్నికల కోడ్ ఉందని, కోడ్ ముగిసిన తర్వాత జీరో బిల్లు వచ్చేలా చూస్తామని తిప్పి పంపిన అధికారులు.. ఇప్పుడు వారికి సమాధానం ఇవ్వలేక సతమతమవుతున్నారు. సోమవారం నిర్మల్ రూరల్ మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన దాదాపు 150 మంది అర్హులు కలెక్టర్‌ను కలిసి తమ గోడును వెల్లబోసుకున్నారు. తామంతా నిరుపేదలమని, తమకు తెల్లరేషన్ కార్డుతోపాటు గృహజ్యోతి పథకానికి అవసమైన అన్ని అర్హతలు ఉన్నప్పటికీ కరెంటు బిల్లులు కట్టాల్సి వస్తున్నదని వాపోయారు. అక్కడే ఉన్న విద్యుత్‌శాఖ డీఈ నాగరాజును నిలదీశారు. దీనికి డీఈ స్పందించి చాలా మంది వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని, మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దీంతో లబ్ధిదారులు డీఈపై ఆగ్రహం వ్యక్తం చేశారు.



జీరో బిల్లు రావడం లేదని కలెక్టరేట్‌లో విద్యుత్ డీఈతో వాగ్వాదానికి దిగిన కొండాపూర్ గ్రామస్తులు

### పర్యవేక్షణ లోపం వల్లనే..

కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా గతేడాది డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు. ఈ దరఖాస్తుల్లో గృహజ్యోతి పథకం కోసం జిల్లా వ్యాప్తంగా 1,13,293 వచ్చాయి. ఇందులో నుంచి 88,743 మందిని గృహజ్యోతి పథకం కోసం అర్హులుగా తేల్చారు. మిగతా 24 వేల మందికి పైగా అర్హులు గృహజ్యోతికి దూరమయ్యారు. కాగా, జిల్లాలో మొత్తం 1,96,510 గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో తప్పుగా నమోదు చేయడంతోనే సమస్యలు వచ్చాయని లబ్ధిదారులు వాపోతున్నారు.

### జీరో బిల్లు రాలేదు..



మాకు రేషన్ కార్డు ఉన్నది. గ్యారెంటీ పథకాల కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న. అయినా మాకు జీరో బిల్లు రాలేదు. మండలాఫీసుల ఇంకోసారి దరఖాస్తు చేసుకొమ్మని చెప్పిన్రు. నెల కిందట అక్కడికి వెళితే ఎలక్షన్ కోడ్ ఉన్నదని చెప్పి మళ్లీ రమ్మన్నరు. ఇప్పుడు మా ఊరోళ్లతో కలిసి కలెక్టర్ ఆఫీసుకు అచ్చిన. కలెక్టరమ్మ కనికరించి మాకు ఫ్రీ కరెంటు అచ్చేటట్లు సూడాలి.

*- ఎల్లుల్ల లక్ష్మి, గృహజ్యోతి అర్హురాలు, కొండాపూర్*

### మా ఊరిలో సగం మందికి రాలేదు..



కాంగ్రెస్ ప్రభుత్వం పేదోళ్లందరికీ కరెంటు ఫ్రీ ఇస్తున్నామని చెప్తున్నది. మా ఊరిలో సగం మందికి కూడా కరెంటు ఫ్రీ అస్తలేదు. రేషన్‌కార్డు ఉంది. రోజు కూలికి పోయి బతికెటోళ్లం. అయినా కరెంటు బిల్లు వస్తున్నది. ఆఫీసుల చుట్టూ ఎన్ని సార్లు తిరిగినా పని అయితలేదు. అందుకే ఇయ్యాల కలెక్టర్‌కు మా బాధ చెప్పుకుందమని ఊరోల్లందరం కలిసి వచ్చినం. ఇప్పటికైనా మాకు న్యాయం జరుగుతుందో లేదో చూడాలి.

*- మంద సునంద, గృహజ్యోతి అర్హురాలు, కొండాపూర్.*

# అదనపు ట్రిప్పులు నడపాలని ఆందోళన



బస్సుకు అడ్డు తగిలి నిరసన వ్యక్తం చేస్తున్న లింబా(బీ) గ్రామస్తులు

కుంటాల, జూన్ 24 : లింబా(బీ) గ్రామస్తులు సోమవారం భైంసా డిపో ఆర్టీసీ బస్సును ఆపి నిరసన వ్యక్తం చేశారు. గతంలో భైంసా–లింబా(బీ) సర్వీసులో ఐదు ట్రిప్పులు ఉండగా ప్రయాణికుల ఆక్యుపెన్సీ తక్కువగా ఉండడం వల్ల ట్రిప్పులను తగ్గించామని ఆర్టీసీ అధికారులు చెప్పారని గ్రామస్తులు అన్నారు. పాఠశాలలకు సమయానికి వెళ్లే విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఇప్పుడు ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకంతో లబ్ధి చేకూరడం లేదని తెలిపారు. మా గ్రామానికి ట్రిప్పులు పెంచాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ కొద్ది సేపు బస్సుకు అడ్డు తగిలారు. మొబైల్‌లో ఆర్టీసీ అధికారులు గ్రామస్తులతో మాట్లాడగా ఉన్నతాధికారులకు నివేదించి సమస్యను పరిష్కరిస్తామని తెలుపడంతో ఆందోళన విరమించారు. ఓ కాంగ్రెస్ కార్యకర్తనే ఆందోళనలో పాల్గొనడం చర్చనీయాంశమైంది.

# కలెక్టరేట్ ఎదుట ధర్నా

## మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

నిర్మల్ అర్బన్, జూన్ 24 : నిర్మల్ జిల్లాలో మధ్యాహ్న భోజన కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులను వెంటనే చెల్లించాలని, పెరిగిన వేతనాలకు ఖర్చులకు అనుగుణంగా వేతనాలను అందించాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ అభిలాష అభినవ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.



నిర్మల్ కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

# ఆగ్రహజ్వాలలు

## సమస్యలు పరిష్కరించాలంటూ ఆందోళనల పర్వం

- నిరసనలు, ధర్నాలతో దద్దరిల్లిన కలెక్టరేట్
- రిమ్స్‌లో ఎదుట జూనియర్ డాక్టర్ల సమ్మె
- డీఎస్సీ పోస్టులు పెంచాలంటూ నిరుద్యోగుల నిరసన
- కలెక్టర్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ టీచర్ల ధర్నా
- ఐటీడీఏ కార్యాలయం వద్ద తుడుందెబ్బ ఆందోళన



గ్రంథాలయంలో నిరసన తెలుపుతున్న డీఎస్సీ అభ్యర్థులు

ఆదిలాబాద్, జూన్ 24(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ పట్టణం సోమవారం ధర్నాలు, నిరసనలు, ఆందోళనలతో దద్దరిల్లింది. తమ సమస్యలను పరిష్కరించాలని జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఆదిలాబాద్ రిమ్స్ ఎదుట జూనియర్ డాక్టర్లు తమకు ఉపకార వేతనాలు పంపిణీ చేయాలని, పెండింగ్ సమస్యలను పరిష్కరించాలంటూ సమ్మెబాట పట్టారు. దీంతో రిమ్స్‌లోని పలు విభాగాల్లో వైద్య సేవలు నిలిచిపోయాయి. ప్రభుత్వం ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని, మెగా డీఎస్సీ నిర్వహించాలని ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులు గ్రంథాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా 997 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటే కేవలం 206 పోస్టులను భర్తీ చేయడం వల్ల నిరుద్యోగులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల పదోన్నతుల ద్వారా ఏర్పడిన ఖాళీలను కలుపుకుని డీఎస్సీ నిర్వహించాలని సూచించారు. ఇందుకోసం కనీసం 50 రోజులపాటు డీఎస్సీ ప్రక్రియను వాయిదా వేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో సూచించిన విధంగా రూ.18 వేల వేతనం చెల్లించాలని, తమకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తించేలా చర్యలు తీసుకోవాలని, వేతనాల్లో జాప్యం లేకుండా చూడాలని అంగన్‌వాడీ టీచర్లు కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ఎదుట కూడా తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఆదివాసులు ఆందోళన చేపట్టారు. లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని, షెడ్యూల్ ప్రాంతంలో మెగా డీఎస్సీ నిర్వహించాలని, పోడు భూములు సాగు చేస్తున్న ఆదివాసీ రైతులకు పట్టాలు ఇవ్వాలని, అటవీ హక్కుల చట్టాలను అమలు చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు.




కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు




రిమ్స్ ఎదుట ఆందోళన చేస్తున్న జూనియర్ డాక్టర్లు

### ప్రభుత్వంలో స్పందన లేదు..



జూనియర్ డాక్టర్ల సమస్యల పరిష్కారంలో భాగంగా రెండు నెలల ముందు ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇస్తే ఎన్నికల కోడ్ ఉందని, తర్వాత పరిష్కరిస్తామని చెప్పారు. ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదు. జూనియర్ వైద్యులకు ప్రతినెల ఉపకార వేతనాలను రెగ్యులర్‌గా ఇవ్వాలి. కొత్తగా ఆసుపత్రిల్లో విద్యార్థులు సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. దవాఖానల్లో సౌకర్యాలు కల్పించాలి. వైద్యులపై దాడులు అరికట్టే విధంగా సెక్యూరిటీని నియమించాలి. మా నిరసనలో భాగంగా ఓపీ, వార్డు డ్యూటీలు బహిష్కరించాం.

*- సందీప్ చారి, అధ్యక్షుడు, జూనియర్ వైద్యుల సంఘం*

### పదోన్నతుల తర్వాత డీఎస్సీ నిర్వహించాలి



ప్రభుత్వం ఉపాధ్యాయుల పదోన్నతులు చేపట్టింది. ఈ ప్రక్రియ అనంతరం భారీగా టీచర్ల పోస్టుల ఖాళీలు ఏర్పడుతాయి. ఇందు కోసం డీఎస్సీ ప్రక్రియను 50 రోజులు వాయిదా వేయాలని కోరుతున్నాం. టెట్ ఫలితాలు ఇటీవల వెలువడ్డాయి. ప్రస్తుతం ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 206 ఉండగా ఉపాధ్యాయులు ప్రమోషన్ల అనంతరం పోస్టుల సంఖ్య 997కు పెరిగే అవకాశా లున్నాయి. ఖాళీల సంఖ్య పెరగడంతో ఎక్కువ మంది నిరు ద్యోగులకు ఉద్యోగాలు లభిస్తాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ దిశ గా చర్యలు తీసుకోవాలి.

*- సాత్విక్ రెడ్డి, డీఎస్సీ అభ్యర్థి, ఆదిలాబాద్*

### నిరుద్యోగులకు న్యాయం చేయాలి..



ప్రభుత్వం డీఎస్సీలో నిరుద్యోగులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలి. 2017 నుంచి డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్నాం. ఉపాధ్యాయుల ప్రమోషన్ల అనంతరం ఏర్పడిన ఖాళీలతో డీఎస్సీ నిర్వహిస్తే ఎక్కువ మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు లభించే అవకాశాలున్నాయి. 2023లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో ఎస్జీటీ ఉపాధ్యాయులు ఖాళీలు 144 ఉండే, ఇప్పుడు కేవలం 148 ఖాళీలు మాత్రమే చూపించారు.

*- సాగర్, డీఎస్సీ అభ్యర్థి, ఆదిలాబాద్*

# ఇంటి పట్టాల కోసం..

ఎదులాపురం, జూన్ 24 : పట్టణంలోని 170 కాలనీలో నివాసం ఉంటున్న నిరుపేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బి. వెంకటనారాయణ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దాదాపు 100 కుటుంబాలు ఎనిమిదేండ్లుగా గుడిసెలు వేసుకుని సర్వే నంబర్ 170లో నివసిస్తున్నాయని గుర్తు చేశారు. వీరి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎర్రజి హరీశ్, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు దండేకర్ వామన్, నాయకులు పెరిగ గంగమ్మ, తారాబాయి, రఫీక్, మనోజ్, తౌఫిక్, రమాకాంత్, వర్ష, రోహిత్, సుక్‌దేవ్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కాలనీ వాసులు

# ఖాళీలను భర్తీ చేయాలి..

ఉట్నూర్ రూరల్, జూన్ 24 : ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్‌లు చేపట్టిన తరువాత ఏర్పడిన ఖాళీలను డీఎస్సీలో జతచేసి పరీక్షలు నిర్వహించాలని నిరుద్యోగులు కోరుతున్నారు. ఈ మేరకు సోమవారం మండలంలోని కేబీ కాంప్లెక్స్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్‌లు చేపట్టడం ద్వారా సుమారు 20 వేల ఖాళీలు ఏర్పడే అవకాశం ఉందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం 25 వేలతో మెగా డీఎస్సీ వేయాలని అన్నారు. ప్రస్తుతం 11,062 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారని, వాటికి బదిలీలు, ప్రమోషన్‌లతో ఏర్పడిన ఖాళీలతో కలిపి 20 వేలపైన పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్సీ నిరుద్యోగులు కేంద్రే గోవింద్, విశ్వనాథ్, అరవింద్, మోహన్, శివ ప్రసాద్, నాగరాజ్ పాల్గొన్నారు.




నిరసన తెలుపుతున్న నిరుద్యోగులు

# నకిలీ విత్తన నిందితులకు బెయిల్ రద్దు

## 14 రోజులపాటు జ్యుడిషియల్ రిమాండ్

ఎదులాపురం, జూన్ 24 : రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నకిలీ విత్తన కేసు నిందితులకు బెయిల్‌ను రద్దు చేసినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.ప్రభాకర్‌రావు తెలిపారని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి వెల్లడించారు. మే 25వ తేదీన ఆదిలాబాద్ పట్టణంలో కేంద్రాన్ని నెలకొల్పి రైతులను మోసగించే ముఠాను పోలీసులు అరెస్టు చేసిన విషయం విధితమే. ఈ క్రమంలో నిందితుల నుంచి దాదాపు రూ.19 లక్షల విలువ గల 500 కిలోల నకిలీ పత్తి విత్తనాలు పట్టుకున్నామన్నారు. ఎస్పీ గౌష్ ఆలం ఆదేశాల మేరకు జిల్లా సెషన్స్ కోర్టులో రివిజన్ ఫైల్ చేయగా, వాదనలు విన్న ప్రభాకర్‌రావు బెయిల్‌ను తిరస్కరించి మూడు రోజుల్లోగా లొంగిపోవాలని తెలిపారన్నారు. అందుకు సోమవారం సామ అశోక్‌రెడ్డి(ఏ1) రాజేందర్(ఏ2)లు మున్సిప్ కోర్టులో లొంగిపోయారన్నారు. వారికి కోర్టు 14 రోజులపాటు జ్యుడిషియల్ కస్టడీని విధించి జిల్లా జైలుకు తరలించామని పేర్కొన్నారు. నేరానికి పాల్పడిన నిందితులకు ఆశ్రయమిచ్చిన షాపుల ఓనర్‌లకు నోటీసులు జారీ చేశామన్నారు. షాపులను ఎమ్మార్వో సమక్షంలో సీజ్ చేయడం జరిగిందన్నారు.

# రూ.41.31 లక్షల గుట్కా సీజ్

ఎదులాపురం, జూన్ 24 : ఆదిలాబాద్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల డైమండ్ ట్రాన్స్‌పోర్ట్ గోదాములో రూ.41,31,500 విలువ గల నిషేధిత గుట్కాను పట్టుకున్నట్టు ఎస్పీ గౌష్ ఆలం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు దాడులు చేశామని పేర్కొన్నారు. గుట్కా దందా చేస్తున్న ఎస్కే రహమతుల్లా, అర్బజ్‌ఖాన్, సైఫ్ ఉల్లాఖాన్, షమీముల్లాఖాన్, ఫసివుల్లాఖాన్, సాజీద్ ఉల్లాఖాన్‌లపై కేసు నమోదు చేశామన్నారు. ప్రభుత్వం నిషేధించిన గుట్కాను విక్రయించిన, రవాణా చేసిన, నిల్వ ఉంచిన చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గుట్కాను సమూలంగా రూపుమాపేంత వరకు నిరంతరం దాడులు కొనసాగుతాయని తెలిపారు.



సీజ్ చేసిన గుట్కా బ్యాగులు